# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-07-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం తల్లికి వందనం రెండో విడతలో నిధులు సహా పలు అంశాలపై చర్చిస్తోంది.**
2. **సమర్ధ నీటి ప్రణాళికతో చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందిస్తున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
3. **స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా పీ 4 విధానం ద్వారా పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నామని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.**
4. **విశాఖపట్నంలో సింహాచలం గిరి ప్రదక్షిణ కొద్దిసేపట్లో ప్రారంభమవుతుంది.**
5. **భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా పీవీఎన్ మాధవ్ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు.**

===========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈ రోజు సమావేశమైంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో తల్లికి వందనం రెండో విడత నిధుల విడుదల, రాజధానిలో భూ సమీకరణ, పలు సంస్థలకు భూ కేటాయింపులు వంటి అంశాలపై మంత్రి వర్గం చర్చిస్తోంది. అలాగే బనకచర్ల ప్రాజెక్ట్‌కు సంబంధించి మంత్రివర్గంలో ప్రత్యేక చర్చ జరిగే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

సమర్ధ నీటి ప్రణాళికతో చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందిస్తున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద నిర్వహించిన జలహారతి కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొని హారతి ఇచ్చారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, పట్టిసీమ రాయలసీమ నీటి ప్రాజెక్టులకు వరప్రదాయినిగా మారిందని తెలిపారు. ఇప్పటివరకూ 428 టీఎంసీల నీటిని పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు తరలించామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..33.. సెకన్లు

---------------------------

స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా ప్రభుత్వ, ప్రయివేట్, ప్రజల భాగసామ్యం పీ 4 విధానం ద్వారా

పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నామని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని కలెక్టర్ కార్యాలయంలో పీ 4 విధానంపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి ఆర్థిక చేయూత నిచ్చేందుకు ఈ విధానం దోహదపడుతుందని ఈ సందర్భంగా మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 25 సెకన్లు

---------------------------

చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ రోజు పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా మామిడి మార్కెట్ యార్డ్ రైతులతో సమావేశమై.. గిట్టుబాటు ధరపై వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు.

---------------------------

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో జిల్లా ఆరోగ్య సేవల సమన్వయాధికారులు–డిసిహెచ్‌యస్‌ల రాష్ట్ర స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరోగ్య సమన్వయాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి వైద్యసేవలను పర్యవేక్షించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

విద్యుత్తు సరఫరాకు సంబంధించి ప్రజల నుంచి అందే ఫిర్యాదులను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించాలని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని వివిధ విద్యుత్ పంపిణీ సంస్థలతో విద్యుత్ సరఫరాపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన నిన్న దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి కుసుమ్ సౌర విద్యుత్ యూనిట్‌లను వేగవంతం చేయాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయాలను ఎదుర్కొనేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

---------------------------

విశాఖపట్నంలో సింహాచలం గిరి ప్రదక్షిణ కొద్దిసేపట్లో ప్రారంభమవుతుంది. కొండ దిగువన స్వామి వారి తొలి పావంచ వద్ద నుండి స్వామివారి పుష్పరథం ప్రారంభమవుతుంది. ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతి రాజు ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ తెల్లవారుజాము నుంచే వేలాది మంది భక్తులు తరలి వచ్చారు.

మరోవైపు గిరి ప్రదక్షిణ సందర్భంగా ఈ రోజు నుంచి రేపు సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని విశాఖ పట్నం పోలీస్ కమిషనర్ సీపీ శంఖబ్రతబాగ్చీ తెలిపారు.

---------------------------

భారతీయ జనతా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తామని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. విజయవాడలో బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షులుగా ఈ రోజు ఆయన బాధ్యతలను

స్వీకరించారు. ఈ సందర్భంగా మాధవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో బీజేపీ క్రియాశీలకంగా పనిచేస్తోందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రప్రభుత్వం సహకరిస్తోందని చెప్పారు.

---------------------------

శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరానికి చెందిన చేనేత కళాకారులు జి.నాగరాజు కేంద్ర చేనేత, జౌళి శాఖ జాతీయ చేనేత పురస్కారం 2024కు ఎంపికైయ్యారు. చేనేత పరిశ్రమకు సంబంధించి ... డిజైన్స్ ..ఆకృతుల అభివృద్ధి విభాగం కింద ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేశామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆగస్టు ఏడవ తేదీన ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ పురస్కారాన్ని అందజేస్తారు.

---------------------------

ప్రభుత్వ పథకాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అనంతపురం మై భారత్ కార్యాలయ అధికారి శ్రీనివాసులు తెలిపారు. అనంతపురంలో ఈరోజు ఆయన మాట్లాడుతూ, యువతలో నైపుణ్య అభివృద్ధిని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. ఇందులో భాగంగా అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో "వికసిత్ భారత్ కా అమృత్ కాల్ సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమం" కార్యక్రమాలపై యువతకు కార్యశాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

---------------------------

నీటి సంరక్షణ, నిర్వహణతో పాటు, ముఖ్యంగా వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం జలశక్తి అభియాన్‌లో వర్షపునీరు ఒడిసిపట్టడం "క్యాచ్ ది రైన్" కార్యక్రమాన్ని చేపట్టింది. "ప్రజా అవగాహన దిశగా నీటి సేకరణలో ప్రజల భాగస్వామ్యం" అనే ఇతివృత్తంతో దేశవ్యాప్తంగా 148 జిల్లాలలో ఈ ప్రచారాన్ని ఈ ఏడాది మార్చి 22 నుండి నవంబర్ 30 వరకు నిర్వహిస్తోంది. ప్రజలు వర్షపు నీటిని సేకరించి, భవిష్యత్తులో ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.

ఇందులో భాగంగా వాతావరణ మార్పుల ద్వారా పెరుగుతున్న నీటి కొరత నేపథ్యంలో నీటి భద్రత, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవనం ప్రాముఖ్యతపై పలు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు నష్టాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 32 పాయింట్ల నష్టంతో 83 వేల 680 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 7 పాయింట్ల నష్టంతో 25 వేల 515 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతి భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...27 సెకన్లు

=====================